
# వెలుగులు తగ్గిన గ్లో గార్డెన్

- సందర్శకుల రాక తగ్గడంతో వెలవెలబోతున్న వైనం
- పాడైన విద్యుద్దీపాల పునరుద్ధరణపై నిర్లక్ష్యం
- గతంలో రోజుకు రూ.80 వేల ఆదాయం
- నేడు రూ.2వేలు ఆదాయం మాత్రమే రావడంతో భారమైన నిర్వహణ


గాంధీపురం-4లోని గ్లో గార్డెన్



గ్లో గార్డెన్‌లో పూర్తిస్థాయిలో వెలగని విద్యుద్దీపాలు

**రాజమహేంద్రవరం సిటీ:** రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాజమహేంద్రవరం నగరంలో నిర్మించిన గ్లోగార్డెన్‌కు సందర్శకుల రాక తగ్గిపోవడంతో వెలవెలబోతోంది. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల వ్యయంతో ఏడాదిన్నర క్రితం ప్రారంభించిన గ్లో గార్డెన్ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా బెంగుళూరులో మాదిరి రాజమహేంద్రవరం 50వ డివిజన్ గాంధీపురం-4లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పార్క్ అభివృద్ధిలో భాగంగా గ్లో గార్డెన్ ఏర్పాటు చేశారు. చిన్నారులు, యువతీ యువకులు, మహిళలను ఇలా అన్ని వర్గాలను ఆకట్టుకునే విధంగా ఆకర్షణీయమైన రంగురంగుల విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. సందర్శకులు వచ్చే సమయంలో రకరకాల తినుబండారాలు విక్రయించేందుకు ఐదు షాపులను పార్కులో నిర్మించారు.

**నాడు కళకళ.. నేడు వెలవెల**

అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ నేతృత్వంలో నిర్మించిన గ్లో గార్డెన్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంతకాలం నిర్వహణ సక్రమంగా ఉండటంతో సందర్శకులతో కళకళలాడుతూ ఉండేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్లో గార్డెన్‌పై సరైన ప్రచారం లేకపోవడంతోపాటు, నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో సందర్శకులు లేక వెలవెలబోతోంది. గ్లో గార్డెన్ ప్రారంభ సమయంలో రోజుకు వేలాదిమంది సందర్శనకు వచ్చే సమయంలో ప్రతి రోజు సుమారు రూ.80 వేల ఆదాయం సమకూరేది. ప్రస్తుతం సందర్శకుల రాక తగ్గిపోవడంతో రోజుకు రూ. 2 వేలు ఆదాయానికి పడిపోయిందని అధికారులు చెబుతున్నారు. సందర్శకులు వచ్చినా రాకపోయినా విద్యుత్ దీపాలను వెలిగించేందుకు కరెంట్ ఖర్చు నగరపాలక సంస్థకు భారంగా మారింది. పాడైన పరికరాలను, లైట్లను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. గ్లో గార్డెన్‌పై సరైన ప్రచారం లేకపోవడంతోనే సందర్శకులు రావడం తగ్గిందని నగర ప్రజలు చర్చించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన గ్లో గార్డెన్‌ను ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా చర్యలు చేపట్టి పూర్వ వైభవం తీసుకురావాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

### గ్లో గార్డెన్‌ను అందరూ కాపాడుకోవాలి



ప్రజాధనంతో నిర్మించిన గ్లో గార్డెన్‌ను పార్టీలకు అతీతంగా కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. నగర పాలక సంస్థ అధికారులు, కూటమి నాయకులు, వివిధ పార్టీల నాయకులు సంయుక్తంగా గ్లో గార్డెన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి.

– గుడిమెట్ల వెంకటరెడ్డి( బాలాజీరెడ్డి),రాజమహేంద్రవరం

### అద్భుతమైన పార్కు



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాజమహేంద్రవరంలో అద్భుతమైన గ్లో గార్డెన్ ఏర్పాటు చేసారు. అధికారులు గ్లో గార్డెన్ అభివృద్ధికి కృషి చేయాలి. మరింత ప్రచారం చేయాలి. ప్రజాధనంతో నిర్మించిన గ్లో గార్డెన్ జిల్లా వాసులకు వరం లాంటిది. ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపాలి.

– పెరుమళ్ల శిరీష, రాజమహేంద్రవరం

## క్లుప్తంగా

### అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

**ధవళేశ్వరం:** అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సీనియర్ జర్నలిస్ట్ ఖండవిల్లి భరత్‌కుమార్‌ను రాయవరం మండలం చెల్లూరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు సీహెచ్ వీర్రాజు చౌదరి ఫోన్ చేసి బెదిరించడం ఆందోళన కలిగించే విషయమని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నిజాయతీగా పనిచేస్తున్న దివ్యాంగుడైన భరత్‌ను ఎన్డీఏ కూటమి నాయకుడు వ్యక్తిగతంగా దూషించడం బాధాకరమన్నారు. వీర్రాజు తక్షణమే భరత్‌కుమార్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం నిరంకుశ వైఖరికి నిరసనగా చలో చెల్లూరుకు పిలుపునిస్తామని పోసికుమార్ హెచ్చరించారు.

### రైతులకు అందుబాటులో యూరియా

**సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం):** జిల్లాలో రైతులకు యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల అవసరాలను గుర్తించి, సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం పర్యవేక్షణ చేస్తుందని చెప్పారు. ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే 89779 35611 ఫోన్ నంబరుకు తెలపాలన్నారు. ఖరీఫ్ 2024లో యూరియా వినియోగం మొత్తం 27,000 మెట్రిక్ టన్నులు కాగా, ఇప్పటి వరకూ 21,500 మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశామని అన్నారు. ఆదివారం ఒక్కరోజు 511 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ జరిగిందన్నారు.

### 'వివేకానంద మహారోగి'లో స్వచ్ఛ భారత్

**రాజమహేంద్రవరం రూరల్:** బొమ్మూరులోని శ్రీవివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలో ఆదివారం ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల యానిమేషన్, బీబీఎం, పీజీ ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలకు చెందిన విద్యార్థులు స్వచ్ఛ భారత్, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు.ఫలపుష్పాలు అందించే 40 రకాల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు వ్యర్థ పదార్థాలను, ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎస్ సభ్యులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

### విజ్ఞానశాస్త్రం సమాజ అభ్యున్నతికి దోహదం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపి

**కంబాలచెరువు (రాజమహేంద్రవరం):** విజ్ఞాన శాస్త్రం సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తుందని ఎమ్మెల్సీ గోపి అన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా మహాసభ స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో అధ్యక్షుడు కె.భీమయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దీనికి హాజరైన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి మాట్లాడుతూ ప్రస్తుత సమాజానికి జనవిజ్ఞాన వేదిక అవసరం ఎంతో ఉందన్నారు. సైన్స్ మానవ పరిణామక్రమాన్ని వివరిస్తుందని అన్నారు. ప్రజలకు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి జన విజ్ఞాన వేదిక మరింత క్రియాశీలకంగా పని చేయాలన్నారు. మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ ప్రకృతి నుంచి మానవుడు ఎన్నో నేర్చుకుని విజయాలు సాధించాడన్నారు. ప్రస్తుతం అభివృద్ధి పేరుతో ప్రకృతి విధ్వంసం జరుగుతోందని, అది మానవ మనుగడకు ప్రమాదకరంగా తయారైందన్నారు. అనంతరం నిర్వహించిన సంఘ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె.భీమయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎన్.రవిబాబు, గౌరవ అధ్యక్షుడిగా వై.పైడియ్య, ఎం.మల్లికార్జునరావు, డాక్టర్ చైతన్య శేఖర్, వై ఆనంద్, సహాధ్యక్షుడిగా విశ్వనాథం, రంగవల్లి, వీటీ విల్సన్‌రాజు, చిలుకూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా జి.తాతారావు, కార్యదర్శులను ఎన్నుకున్నారు.

### శ్రీమహాలక్ష్మి అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్టే


బి.గోపాల్‌ను సత్కరిస్తున్న చిన్నవెంకన్నబాబు

**సీటీఆర్ఐ:** శ్రీమహాలక్ష్మి అమ్మవారి అనుగ్రహం ఉంటే అన్నీ ఉన్నట్టేనని ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు బి.గోపాల్ అన్నారు. గాదాలలోని శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వెంకటేశ్వరస్వామి పీఠంలోని అమ్మవారిని ప్రముఖ తెలుగు సినీ దర్శకుడు బి.గోపాల్ ఆదివారం దర్శించుకుని పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ప్రతి గురువారం మహాలక్ష్మి వ్రతమాచరించడం ఇక్కడ విశేషంగా ఉందన్నారు. అనంతరం బి.గోపాల్‌ను సత్కరించి, శ్రీమహాలక్ష్మి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రముఖ డాక్టర్ కేశిరాజు రాంప్రసాదు, మనగుడి, మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి చైర్మన్ ధరణికోట దుర్గావెంకటహేమావతి, అనుగ్రహప్రద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్, చైర్మన్ మతల రమేష్ పాల్గొన్నారు.

# చిరస్మరణీయుడు సర్వేపల్లి రాధాకృష్ణన్


పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులు


ఉపాధ్యాయులను సత్కరించిన ఆకుల వీర్రాజు తదితరులు

**సీటీఆర్ఐ:** ఉపాధ్యాయ లోకానికి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శనీయులని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. పాన్ ఇండియన్ సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ అద్దంకి రాజా యోనా ఆధ్వర్యంలో సీనియర్ పాత్రికేయులు కృష్ణకుమార్ అధ్యక్షతన ఆదివారం ధర్మంచర కమ్యూనిటీ హాల్లో గురుపూజోత్సవ వేడుకలు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా, రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ, అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖాధికారి వై.మల్లేశ్వరరావు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు, తెలుగు భాష పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ పాల్గొని ప్రసంగించారు. ఇరవై మంది విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులను సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇన్‌స్పిరేషనల్ అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని రాంబాబు, ఎన్ఎస్ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరావు, ఉంగరాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

**సమాజంలో గురువుల పాత్ర అత్యంత కీలకం**

**రాజమహేంద్రవరం సిటీ:** సమాజంలో గురువుల పాత్ర అత్యంత కీలకమైనదని, అటువంటి గురువులను మనం నిత్యం గౌరవించుకోవాలని కందుకూరి వీరేశలింగం పురమందిరం (టౌన్ హాల్) లైబ్రరీ కార్యదర్శి డిస్ట్రిక్ట్ సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు కొనియాడారు. ఆదివారం స్థానిక కందుకూరి వీరేశలింగం పురమందిరంలో గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం టౌన్ హాల్ ట్రస్ట్ బోర్డ్ కార్యదర్శి జమ్మి రామారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు ఆకుల వెంకటేశ్వర్లు, ఈదల సూర్య భాస్కరరావు, ఏవీడీ ప్రసాదరావు, చిల్లి విజయప్రసాద్‌రావు, గ్రంధి వెంకటేశ్వరరావు, యెలుమర్తి స్వరాజ్యలక్ష్మిని అతిథుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో జూబ్లీ లైబ్రరీ అధ్యక్షుడు జగన్నాథం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు రెడ్డి రాజు, మోర భరద్వాజ, మాజీ కార్పొరేటర్లు మంచాల బాబ్జి, బెజవాడ రాజ్ కుమార్, జూబ్లీ లైబ్రరీ సహాయ కార్యదర్శి కె. సత్యనారాయణ, టౌన్ హాల్ లైబ్రేరియన్ వీటీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

### పోస్టల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


ఎన్నికైన యూనియన్ల నాయకులు

**రాజమహేంద్రవరం సిటీ:** క్షేత్రస్థాయిలో పోస్టల్ శాఖలోని ఉద్యోగుల సమస్యలను, ఇబ్బందులను ఉన్నతాధికారులకు తెలియజేసి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హెడ్‌పోస్ట్ మాస్టర్ జి.సువర్ణరాజు అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ఆర్గనైజేషన్ అనుబంధ నేషనల్ అసోసియేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ (ఎన్ఏపీఈ) గ్రూప్ సి, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్, ఎన్‌యూ జీడీఎస్ ద్వైవార్షిక మహాసభలు ఆదివారం స్థానిక రాజమహేంద్రవరం హెడ్ పోస్టాఫీస్‌లో నిర్వహించారు. రాజమహేంద్రవరం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కె.శేషారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో గ్రూప్ సి ప్రెసిడెంట్‌గా బి.గౌరీశంకర్, పోస్ట్‌మ్యాన్ అండ్ ఎంటీఎస్‌కు ప్రెసిడెంట్‌గా పి.శాంతిభూషణరావు, ఎన్‌యూ జీడీఎస్‌కి ప్రెసిడెంట్‌గా తోటాడ అన్నపూర్ణ ఎన్నికయ్యారు.

### సినిమాలు :



| | |
|---|---|
| శ్యామల : | ఘాటీ |
| సూర్యమినీ : | దికంజ్యూరింగ్ |
| సూర్యప్యాలెస్ : | ఘాటీ |
| స్వామి : | కూలీ |
| అనుశ్రీ : | మదరాసి |
| శివజ్యోతి : | దిబెంగాల్‌ఫైల్స్ |
| రాజా : | మదరాసి |
| ఊర్వశి : | లిటిల్‌హార్ట్స్ |
| మేనక : | దికంజ్యూరింగ్ |
| రంభ : | మహావతార్ నరసింహ |
| అప్సర : | కొత్తలోక |
| అశోక : | మదరాసి |
| **నామవరం:** | |
| వీఎస్.మహల్ : | ఘాటీ |
| **ధవళేశ్వరం:** | |
| మురళీకృష్ణ : | ఘాటీ, మదరాసి |
| **కడియం:** | |
| వెంకటసూర్య : | మదరాసి,ఘాటీ |

# కూటమి ప్రభుత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకత

**వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి చెల్లుబోయిన వేణు**


మాట్లాడుతున్న చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, చిత్రంలో డాక్టర్ గూడూరి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం రూరల్:** కూటమి ప్రభుత్వం 15 నెలల్లోనే తీవ్ర ప్రజావ్యతిరేకతను మూటగట్టుకుందని, మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యమని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ పేర్కొన్నారు. బొమ్మూరులోని పార్టీ కార్యాలయంలో 'అన్నదాత పోరు' పోస్టర్ ఆవిష్కరణకు హాజరైన పార్టీశ్రేణులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపూరిత హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని దాటవేయడం చంద్రబాబు నైజమన్నారు. ప్రతి ఒక్కరూ కూటమి ప్రభుత్వం వైఫల్యాలను ఇంటింటా వివరించాలన్నారు. పార్టీ కోసం కృషి చేస్తున్న నేతలు, కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని చెల్లుబోయిన వేణు స్పష్టం చేశారు. వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంటు ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీలో ప్రతి కార్యకర్తకు గుర్తింపు, గౌరవం ఉంటుందన్నారు. 2029లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు అందరూ కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నక్కా శ్రీనగేష్, గిరిజాల వీర్రాజు (బాబు) మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ కడియం మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికారి ప్రతినిధి ఎంఎం ఆలీ, రాష్ట్ర మహిళా కార్యదర్శి అంగాడి సత్యప్రియ, జిల్లా మహిళా విభాగ అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శివకుమార్, జిల్లా అధికార ప్రతినిధి పెయ్యల రాజేష్, జిల్లా కార్యదర్శులు యెనుముల త్యాగరాజు, ముద్దాల అను, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చీకురుమిల్లి చిన్న, చెరుకూరి సత్యనారాయణ, పెనుమాక సునీల్, చింతపర్తి రాంబాబు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, మాజీ సర్పంచ్ అత్తిలి భీమశంకరం, కొత్తపల్లి నాగేశ్వరరావు, మద్దా దుర్గారావు, బీదం రాజు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణను ఉపసంహరించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, న్యాయవాదులు

**రాజమహేంద్రవరం సిటీ:** ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాజ్యాంగ పరిరక్షణ యాత్రను రాజమహేంద్రవరంలో ఆదివారం నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా మాల ఉద్యోగుల సంఘం చైర్మన్ ఎల్‌వీ ప్రసాద్‌రావు, న్యాయవాది మర్రి బాబ్జీ, జిల్లా మాల సంఘాల జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ యాత్ర నిర్వహించారు. గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం నుంచి క్వారీ మార్కెట్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు దళిత సంఘాల నాయకులు, ఉద్యోగులు, ర్యాలీ నిర్వహించారు. మాజీ కేంద్ర మంత్రి చింత మోహన్, మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్, ఎస్సీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.అశోక్‌బాబు, ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక


అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన అధ్యక్షుడు వికాస్

**రాజమహేంద్రవరం సిటీ:** రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీకి నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. స్థానిక జేఎన్‌రోడ్ ఏకేసీ రోటరీ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడిగా పీవీ వికాస్, కార్యదర్శిగా ఫణీంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడు లంకలపల్లి శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్, ఎన్.సూర్యనారాయణ, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్ అధ్యక్షుడు ఎం.వెంకన్నబాబు, రోటరాక్ట్ కో ఆర్డినేటర్ సుంకర నాగేంద్ర కిషోర్ తదతరులు పాల్గొన్నారు.

# చంద్రగ్రహణం.. ఆలయాల మూసివేత


గ్రహణం సందర్భంగా పట్టు స్నానాలు ఆచరిస్తున్న అర్చకులు, మహిళలు


కోటిలింగాల రేవు వద్ద జపాలు చేస్తున్న పండితులు




చంద్రగ్రహణం సందర్భంగా మూతపడ్డ ఉమా మార్కండేయ స్వామి, విశ్వేశ్వర స్వామి ఆలయాలు, పుష్కరాల రేవులో గోదావరి మాత విగ్రహానికి ముసుగు

సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం రాజమహేంద్రవరం నగరంలోని దేవాలయాలను ఆదివారం మధ్యాహ్నం 12.50 గంటల నుంచి రాత్రి 12:24 గంటల వరకు మూసివేశారు. మధ్యాహ్నం 12 గంటలకు నివేదన పూర్తి చేసిన తరువాత ఆలయాలను మూసివేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు ఆలయాలను తెరిచి సంప్రోక్షణ అనంతరం యథావిధిగా భక్తులకు దర్శనాలు కల్పిస్తామని అర్చకులు, అధికారులు తెలిపారు.సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా పలువురు పుష్కరఘాట్, కోటి లింగాల రేవుల వద్ద గోదావరిలో గ్రహణం పట్టు స్నానాలు ఆచరించారు.

– ఫొటోలు: సాక్షి, రాజమహేంద్రవరం

# ప్రశాంతంగా గణపతి విగ్రహాల నిమజ్జనం

**రాజమహేంద్రవరం రూరల్:** గ్రామాల్లో ఆదివారంతో గణపతి నవరాత్రి వేడుకల ముగింపు సందర్భంగా గణనాథుల విగ్రహాల నిమజ్జనాలు ప్రశాంతంగా ముగిసాయి. గ్రామాల్లోని వినాయక విగ్రహాలను స్థానికంగా ఉన్న చెరువుల్లో, గోదావరిలో నిమజ్జనం చేశారు. వినాయక విగ్రహాలను భారీ ర్యాలీగా డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. మహిళలు సైతం నిమజ్జన కార్యక్రమంలో పాల్గొని సందడి చేశారు.

**వేలంలో లడ్డూ రూ.60వేలు**

బొమ్మూరు వెంకటగిరికొండ వేంకటేశ్వరస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి వేడుక మండపంలో ఏర్పాటుచేసిన లడ్డూను ఆదివారం నిర్వహించిన వేలంలో వాసంశెట్టి గంగరాజు దంపతులు రూ.60 వేలకు దక్కించుకున్నారు.

**పుష్కర ఘాట్‌లో గణపతికి పూజలు**

**రాజమహేంద్రవరం సిటీ:** రాజమహేంద్రవరం నగరంలో పుష్కర ఘాట్‌లో రాజమహేంద్రి గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న ధూంధాం శుభంకర గణపతి నిమజ్జన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


గణపతికి పూజలు నిర్వహిస్తున్న జక్కంపూడి రాజా


పుష్కరాల రేవు వద్ద పసుపు పోగులను పంపిణీ చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి


కాతేరులో వినాయక నిమజ్జన ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు


బొమ్మూరులో రూ.60 వేలుకు వేలంలో లడ్డూ దక్కించుకున్న వాసంశెట్టి గంగరాజు, మహేష్